సాక్షి
పెద్దపల్లి
మంగళవారం : 9 : ఏప్రిల్ : 2024



వైభవంగా పోచమ్మ బోనాలు

ఎలిగేడు : వాల్మీకి బోయ సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళ(సా॥)	సహర్ బుధ(ఉ॥)
కరీంనగర్	6.29	4.33
పెద్దపల్లి	6.36	4.44
రాజన్న సిరిసిల్ల	6.36	4.42
జగిత్యాల	6.36	4.40

గరిష్టం/కనిష్టం
39.0/25.6

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండగా, ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కాంగ్రెస్‌తోనే ముస్లింలకు రిజర్వేషన్లు : ఎమ్మెల్యే ఠాకూర్



ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

జ్యోతినగర్(రామగుండం): కాంగ్రెస్ హయాంలోనే ముస్లింలకు రిజర్వేషన్ల సౌకర్యం కల్పించామని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. సోమవారం భీమునిపట్నంలోని జబల్ మసీదులో కాంగ్రెస్ పట్టణ కమిటీ అధ్యక్షుడు ఆసిఫ్ పాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో ముస్లింలకు 6శాతం రిజర్వేషన్లు కల్పించామని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ చేతిగుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. నాయకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలతో పాటు మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సజావుగా ధాన్యం కొనుగోళ్లు



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో నిర్దేశిత లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగాలని, రేపటి వరకు అన్ని ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం సంబంధిత శాఖ అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. నిబంధనలకు లోబడి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో చలువపందిళ్లు వేయించి, తాగునీటి వసతి కల్పించాలన్నారు. ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచి శుభ్రం చేసిన తర్వాతే వడ్లు కొనుగోలు చేయాలని సూచించారు. జిల్లా సహకార శాఖ అధికారి శ్రీమాల, డీఎం ప్రవీణ్, డీఆర్డీవో రవీందర్ తదితరులు ఉన్నారు.

14లోగా ఓటరుగా పేరు నమోదు చేసుకోండి

పెద్దపల్లిరూరల్: జిల్లాలో 18 ఏళ్ల వయసు నిండిన వారు అందరూ ఈనెల 14వ తేదీలోగా ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవాలని పెద్దపల్లి సెగ్మెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి గంగయ్య సోమవారం తెలిపారు. ఇప్పటికే తమ పేరు నమోదై ఉంటే సరిచూసుకోవాలని సూచించారు. ఓటుహక్కు పొంది పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఇసుక రీచ్‌లు ఎత్తివేయాలి



ఏవో శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని కాల్వశ్రీరాంపూర్ మండలం మొట్లపల్లి, కిష్టంపేట, మీర్జంపేట గ్రామాల్లోని ఇసుక రీచ్‌లు రద్దు చేయాలని ఆయా గ్రామాల రైతులు సోమవారం కలెక్టరేట్‌లో ఏవో శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఇష్టానుసారంగా ఇసుక తరలించడంతో భూగర్భజలాలు అడుగంటే ప్రమాదం ఉందన్నారు.

సీఎంఆర్ డెలివరీ చేయండి

సుల్తానాబాద్‌రూరల్: గతేడాది వానాకాలానికి సంబంధించి కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను ఎఫ్‌సీఐకి సకాలంలో డెలివరీ చేయాలని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ సూచించారు. కాట్నపల్లిలోని సాయిసరస్వతి, భొతకుంటపల్లిలోని నందిని, ప్రవంతి రైస్‌మిల్లులను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. మిల్లులకు కేటాయించిన ధాన్యం, సరఫరా చేసిన బియ్యం, నిల్వఉన్న ధాన్యం తదితర సమాచారం సేకరించారు. రికార్డులు పరిశీలించారు. నిర్దేశిత సీఎంఆర్ లక్ష్యం పూర్తిచేయని మిల్లులను బ్లాక్ లిస్టులో చేర్చేతామని ఆయన హెచ్చరించారు. జిల్లా సహకార అధికారి శ్రీమాల, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్ తదితరులు ఉన్నారు.

ఆలస్యంగా నడిచిన సింగరేణి రైలు

ఓదెల(పెద్దపల్లి): భద్రాచలం నుంచి సిరిపూర్ కాగజ్‌నగర్ మధ్య సింగరేణి ప్యాసింజర్ రైలు సోమవారం ఆలస్యంగా నడిచింది సుమారు 2 గంటల పాటు ఆలస్యంగా నడవడంతో ఓదెల, పొత్కపల్లి, జమ్మికుంట, పెద్దపల్లి, రామగుండం రైల్వేస్టేషన్లలోని ప్రయాణికులు నరకయాతన పడ్డారు. ఒకవైపు ఎండల తీవ్రత.. మరోవైపు రైలు గంటల తరబడి ఆలస్యంగా కావడంతో ప్రయాణికులు ఆవేదన చెందారు. భద్రాచలం, సిరిపూర్ కాగజ్‌నగర్ మధ్య ఏకైక రైలు సింగరేణి మాత్రమే. సమయానుకూలంగా నడిపించాలని వారు కోరుతున్నారు.

రాజపూజ్యం ఎవరికో?



- నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి ఎంపీ స్థానాల్లో రసవత్తర రాజకీయం
- ప్రధాన పార్టీల్లో రాజయోగం వరించేదెవరినో?
- క్రితంసారి అనూహ్య విజయాలు నమోదు
- ఈసారి మూడు పార్టీలకు ప్రతిష్టాత్మకం


సాక్షి ప్రతినిధి, కరీంనగర్:
ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 13 నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో జగిత్యాల, మెట్‌పల్లి నిజామాబాద్ పరిధిలోకి, సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి, కరీంనగర్, మానకొండూరు, హుజూరాబాద్, హుస్నాబాద్ కరీంనగర్ పరిధిలోకి, పెద్దపల్లి, ధర్మపురి, రామగుండం, మంథని పెద్దపల్లి ఎంపీ సెగ్మెంట్ పరిధిలోకి వస్తాయి. మూడు స్థానాల్లోనూ అభ్యర్థులకు ఈ ఎన్నికలు చాలా కీలకం. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎలాగైనా వీటిని కైవసం చేసుకోవాలని చూస్తున్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పాలైన బీఆర్‌ఎస్ పార్టీ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రెండింటినైనా గెలిచి, తిరిగి పట్టు నిలుపుకోవాలని పావులు కదుపుతోంది. ఐదేళ్ల క్రితం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో సామాన్యులుగా రంగంలోకి దిగిన బండి సంజయ్(కరీంనగర్) సిట్టింగ్ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌ను ఓడించి, ధర్మపురి అర్వింద్(నిజామాబాద్) సిట్టింగ్ ఎంపీ కవితపై పైచేయి సాధించి, అనూహ్య విజయాలను అందుకున్నారు. ఈసారి తమ స్థానాలను నిలబెట్టుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తుండగా.. అదే స్థాయిలో కాంగ్రెస్ కూడా వ్యూహాలు రచిస్తోంది.



బండి సంజయ్ (బీజేపీ)



డి.అర్వింద్ (బీజేపీ)



టి. జీవన్‌రెడ్డి (కాంగ్రెస్)



గడ్డం వంశీ (కాంగ్రెస్)



కొప్పుల ఈశ్వర్ (బీఆర్‌ఎస్)



బి. వినోద్ (బీఆర్‌ఎస్)



బి. గోవర్ధన్ (బీఆర్‌ఎస్)



జి. శ్రీనివాస్ (బీజేపీ)

నినాదాలు.. మేనిఫెస్టోలు..

నిజామాబాద్, పెద్దపల్లిల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ తమ అభ్యర్థుల్ని ఇప్పటికే ప్రకటించాయి. వారు ఇప్పటికే ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. నిజామాబాద్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్(బీఆర్‌ఎస్), ధర్మపురి అర్వింద్(బీజేపీ), తాటిపర్తి జీవన్‌రెడ్డి(కాంగ్రెస్)లు పోటీ పడుతున్నారు. పెద్దపల్లి నుంచి గడ్డం వంశీ(కాంగ్రెస్), గోమాస శ్రీనివాస్ (బీజేపీ), కొప్పుల ఈశ్వర్ (బీఆర్‌ఎస్)లు బరిలో ఉన్నారు. కీలకమైన కరీంనగర్ నుంచి బండి సంజయ్(బీజేపీ), బి.వినోద్‌కుమార్(బీఆర్‌ఎస్)లు బరిలో ఉండగా.. కాంగ్రెస్ ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు. దేశభక్తి, అయోధ్య రామాలయం, ఉమ్మడి జిల్లాలో ప్రారంభించిన ప్రాజెక్టులు, హిందుత్వమే ఏజెండాగా బీజేపీ దూకుడుగా వెళ్తోంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో తమకు అధికారం కట్టబెట్టిన 6 గ్యారంటీలనే కాంగ్రెస్ నమ్ముకుంది. దీనికితోడు కేంద్ర నాయకత్వం ప్రకటించిన 'పంచన్యాయ్', రాష్ట్రానికి ప్రత్యేకంగా ప్రకటించిన మేనిఫెస్టో తమకు మేలు చేస్తాయని భావిస్తోంది. జాతీయ పార్టీలు రాష్ట్ర అభివృద్ధిని పట్టించుకోవని, తెలంగాణ గళం పార్లమెంట్‌లో వినిపించాలంటే.. తప్పకుండా తమను గెలిపించాలని బీఆర్‌ఎస్ కోరుతోంది.

పార్లమెంట్ స్థానాల జాతక చక్రం

ఎంపీ స్థానాలు : 3
ప్రధాన పార్టీల అభ్యర్థులు : 9 మంది
రాజపూజ్యం : ముగ్గురికి
వ్యయం : రూ.కోట్లు, ఆదాయం : ఓట్లు

ఈసారి ఖర్చు రూ.కోట్లలోనే..

ఈసారి పార్లమెంట్ ఎన్నికల ఖర్చు క్రితంసారితో పోలిస్తే పెరిగేలా ఉంది. ప్రచారం, పెట్రోల్, భోజనం, సభల నిర్వహణ ఖర్చు అమాంతం పెరిగింది. ఇక, జన సమీకరణ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ లెక్కన అభ్యర్థుల వ్యయం శ్రీ క్రోధి నామ సంవత్సరంలో రూ.కోట్లలో ఉండనుందని సమాచారం. దీనికి ప్రతిఫలంగా ప్రజలు ఓట్ల రూపంలో ఆదాయం ఇవ్వనున్నారు. ఇది ఎవరికి అధికంగా ఉంటే వారినే రాజయోగం వరించనుంది. ఈ నేపథ్యంలో ఎంపీ అభ్యర్థులు ఇప్పటికే తమ జాతకాలను పరీక్షించుకుంటున్నారు. ఎవరి ఆదాయ, వ్యయాలు ఎంత? ఎవరి రాజపూజ్యం ఎంత? ఎవరికి రాజయోగం ఉంది? తదితర వివరాలను పండితులను అడిగి తెలుసుకుంటున్నారు.



'క్రోధి' వచ్చే.. ఆనందం తెచ్చే..

తెలుగువారి పండుగ ఉగాది రానే వచ్చేసింది. తెలుగు వాకిళ్లలో క్రోధి నామ సంవత్సరం సందడి మొదలైంది. ఉగాది అంటే ప్రతీ ఒక్కరికి గుర్తుకొచ్చేది పచ్చడి. షడ్రుచుల సమ్మేళనమే పండుగ ప్రత్యేకత. జీవితంలో వచ్చే కష్టసుఖాలను అందరూ అనుభవించాలని గుర్తు చేసేదే పచ్చడి. హిందూ పురాణాల ప్రకారం, ఉగాదిలో 'ఉగ' అంటే నక్షత్ర గమనం.. ఈ గమనానికి ఆది ఉగాది.. అంటే సృష్టి ఉగాది రోజు నుంచే ప్రారంభమైందని అర్థం. చైత్రమాసం శుక్లపక్షంలో సూర్యోదయ వేళకు పాడ్యమి తిథి రోజును ఉగాదిగా నిర్ణయిస్తారు. ఈ పండుగను తెలుగువారే కాకుండా మరాఠీలు 'గుడిపడ్వా'గా, తమిళులు 'పుత్తాండు', మలయాళీలు 'విషు', సిక్కులు 'వైశాఖీ', బెంగాలీలు 'పోయ్ లా బైశాఖ్'గా జరుపుకుంటారు. ఈ సమయంలో ప్రముఖ ఆలయాల్లో పండితులు పంచాంగ శ్రవణం పఠిస్తారు. ఈ నేపథ్యంలో క్రోధి నామ సంవత్సరంలోకి అడుగు పెట్టనున్నాం.

ఒంటినిండా శూలాలు.. గగుర్పొడిచే విన్యాసాలు



రామగుండం మండలం అంతర్గాంలో బర్మా కాంబీకులు తమ ఆరాధ్య దైవం నూకాంబిక పోచమ్మ తల్లి జాతర సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు శరీరానికి శూలాలు గుచ్చుకుని విన్యాసాలు ప్రదర్శించారు.

- వివరాలు 8లో ▸

బీఆర్‌ఎస్ దొంగ దీక్షలు చేస్తోంది

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



అభివాదం చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు

గోదావరిఖని: 'బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడే వర్షాకాలం వచ్చింది.. అప్పుడే వర్షాలు తక్కువగా పడ్డాయి.. దీంతో నీటికి ఇబ్బంది వచ్చింది.. దానికి మేమేదో తప్పుచేసినట్లు బీఆర్‌ఎస్ నాయకులు దొంగ దీక్షలు చేస్తున్నారు' అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నగరంలో జరిగిన పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఎప్పుడో వర్షాలు తక్కువ కురిస్తే తామే కారణమని అడ్డగోలుగా తిడుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు మార్పుకోరి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని, దీనిని ఓర్వలేక ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ వర్తింపజేస్తున్నామని, రూ.10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం అందిస్తున్నామని శ్రీధర్‌బాబు వివరించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతీఒక్కరికి నష్టం కలిగించిందని ధ్వజమెత్తారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ ఎంపీగా పోటీలో ఉన్న మాజీమంత్రి.. రైతుల నుంచి బస్తాకు 5కిలోల తరుగు తీస్తే ఏం చేశారని నిలదీశారు. ఈప్రాంత ప్రజలకు న్యాయం చేయని కొప్పుల ఈశ్వర్‌కు ఈ ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కులేదని అన్నారు. రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, వినోద్, విజయరమణారావు, ప్రేమ్ సాగర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

లీకేజీలకు మరమ్మతు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో తాగునీటి పైపులైన్ల లీకేజీలను అరికట్టడానికి అధికారులు ఎట్టకేలకు స్పందించారు. తాగునీటి పైపులైన్ల లీకేజీపై 'సాక్షి' సోమవారం ఫొటోస్టోరీ ప్రచురించింది. దీంతో అధికారులు స్పందించారు. సోమవారం స్థానిక దుర్గానగర్ ఎదుట ప్రధాన రహదారిపై పైప్‌లైన్‌కు మరమ్మతు ప్రారంభించారు.

సాక్షి స్పందన



దుర్గానగర్ వద్ద పైపులైన్‌కు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

పగులుతున్న పైపులైన్లు

పెద్దపల్లిలోని విద్యానగర్‌లో తాగునీటి పైప్‌లైన్ తరచూ పగులుతోంది. బల్దియా పాలకుల దృష్టికి స్థానికులు తీసుకెళ్తే.. తూతూమంత్రంగా తాత్కాలిక మరమ్మతు చేస్తున్నారు. ఆ తర్వాత కొద్దిరోజులకే పైపులైన్ పగిలి తాగునీరు యథావిధిగా వృథాగా పోతోంది.

- తాగునీరు రోడ్డుపాలు
- అడుగడుగునా లీకేజీలు
- వృథాగా పోతున్న మంచినీరు



ఇది రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్ చౌరస్తాలోని చిత్రం. పైప్‌లైన్ లీకేజీతో తాగునీరు రోడ్డుపై ఇలా వృథాగా పోతోంది. లీకేజీ అరికట్టాలని చాలాసార్లు అధికారులకు విన్నవించినా పరిస్థితి మారడంలేదు. ఫలితంగా శాంతినగర్, గౌతమినగర్ వాసులకు తాగునీటి సరఫరా నిలిచి దాహంతో తపిస్తున్నారు.

పెద్దపల్లిరూరల్/కోల్‌సిటీ(రామగుండం): జిల్లాలోని రామగుండం నగర పాలక సంస్థతోపాటు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీల్లో తాగునీటి పైపులైన్లు తరచూ లీకవుతున్నాయి. ప్రజల దాహం తీర్చాల్సిన తాగునీరు రోడ్లపై వృథాగా పోతోంది. లీకేజీల్లో మురుగునీరు చేరి కలుషిత నీరు సరఫరా కావడంతో కాలనీవాసులు ఆ నీరు తాగి వ్యాధుల బారినపడుతున్నారు.

ముంచుకొస్తున్న తాగునీటి ముప్పు

రామగుండం నగరపాలక సంస్థలో తాగునీటి సమస్య ముంచుకొస్తోంది. ఇప్పటికే రోజువిడిచి రోజు తాగునీరు సరఫరా చేయలేని పరిస్థితి ఏర్పడింది. సమయపాలన కూడా గాడితప్పింది. కనీసం గంటపాటు సరఫరా చేయడానికి సాంకేతికంగా అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. అప్రమత్తంగా ఉండాల్సిన బల్దియా అధికారులు.. నీటి సరఫరా వ్యవస్థను గాలికి వదిలేశారు. నగరంలో ఎక్కడికక్కడ లీకేజీలే దర్శనమిస్తున్నాయి. వాటి మరమ్మతులకు ఏటా నిధులు కేటాయిస్తున్నా.. కాలయాపన చేయడంతో తాగునీరంతా రోడ్లపాలవుతోంది. డ్రైనేజీల్లో కలిసి ఎందుకూ పనికిరాకుండా పోతోంది.

ఫిర్యాదు చేసినా స్పందన లేదు..

పెద్దపల్లిలోని పలు వార్డుల్లో ఇంటింటికీ తాగునీరు అందడం లేదనే ఫిర్యాదులు ఉన్నాయి. ప్రధానంగా విద్యానగర్, చీకురాయిరోడ్డు, ప్రగతినగర్, కమాన్ రోడ్డు, సాగర్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో తరచూ పైపులైన్లు లీకవుతున్నాయి. ఒకచోట మరమ్మతు చేస్తే మరోచోట లీకేజీ ఏర్పడుతోందని స్థానికులు వాపోతున్నారు.

నిధులు విడుదల..

వేసవిలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్ణయించి నిధులు మంజూరు చేసింది. పెద్దపల్లి బల్దియాకు రూ.13.77లక్షలు, సుల్తానాబాద్ మున్సిపాలిటీకి రూ.5.36లక్షలు, మంథని పుర పాలక సంఘానికి రూ.34.96లక్షలు, రామగుండం కార్పొరేషన్‌కు రూ.62.28 లక్షలు కేటాయించింది. వీటిని వెచ్చించి యుద్ధప్రాతిపదికన తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆదేశించింది.

మిషన్‌భగీరథ అస్తవ్యస్తం..

ఇంటింటికీ తాగునీరు అందించేందుకు గత ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పథకం జిల్లాలో అస్తవ్యస్తంగా తయారైంది. పెద్దపల్లిలో ఇంటింటికీ పైపులైన్ నిర్మించినా ఆన్, ఆఫ్ నల్లాలు బిగించలేదు. కమాన్‌రోడ్డు, రాజీవ్‌కాలనీ, నారాయణస్వామినగర్ లాంటి ప్రాంతాల్లో రోడ్డుపై బిగించడంతో దొంగలపాలయ్యాయి. తాగునీరు సరఫరా చేసినప్పుడల్లా రోడ్లపై వృధిగా పోతోంది. దీనికితోడు పైపులైన్‌లు రోడ్డు కింద ఉండడంతో భారీవాహనాలు వెళ్తే పగులుతున్నాయి. లీకేజీలను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను నియమించినా లీకేజీలకు శాశ్వత పరిష్కారం చూపలేకపోతున్నారు.

రోజూ 20వేల లీటర్లు వృథా

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్ ప్రధాన చౌరస్తాలో తాగునీటి పైప్‌లైన్ లీకైంది. నీటికొరతతో అధికారులు రెండ్రోజులకోసారి తాగునీరు సరఫరా చేయడంతో ప్రజల అవసరాలు తీరడం లేదు. ఈక్రమంలోనే తాగునీటి పైప్‌లైన్ లీకై రోజూ సుమారు 18 వేల నుంచి 20వేల లీటర్ల నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు.



పెద్దపల్లి కూనారం చౌరస్తాలో రోడ్డుపై నీరు



గోదావరిఖని మార్కండేయకాలనీలో..



గోదావరిఖని అశోక్‌నగర్ చౌరస్తాలో..



గోదావరిఖని స్వతంత్రచౌక్‌లో..



గోదావరిఖనిలో..



గౌతమినగర్‌లో వృథాగా పోతున్న తాగునీరు

లీకేజీలు అరికడతాం

మిషన్‌భగీరథ పైప్‌లైన్ల లీకేజీలను ఆ పథకానికి సంబంధించిన అధికారులే అరికట్టాలి. అయినా, తాగునీటి సమస్య తలెత్తకుండా బల్దియాలో తగిన చర్యలు తీసుకుంటాం. మున్సిపాలిటీలోని ఏడు బావుల్లో నీటి లభ్యత గుర్తించాం. సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి ట్యాంకర్లతో సరఫరా చేస్తాం. ఇందుకోసం ఐదు టాంకర్లు సిద్ధం చేశాం. మరోఐదు అద్దెకు తీసుకుంటాం.

– వెంకటేశ్, కమిషనర్, పెద్దపల్లి మున్సిపల్

క్లుప్తంగా

ఇసుక డంపు సీజ్



అధికారులు గుర్తించిన ఇసుక నిల్వలు

మంథని: గుంజపడుగు సమీపంలోని కాసిపేట గుడి వద్ద అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్ సీజ్ చేసినట్లు ఆర్ఐ రాజిరెడ్డి తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా ఇసుక డంప్ చేసినట్లు సమాచారం అందడంతో సోమవారం అక్కడకు వెళ్లి 25 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక స్వాధీనం చేసుకొని గుంజపడుగు గ్రామపంచాయతీ కార్యాలయానికి తరలించినట్లు చెప్పారు. రక్షణ నిమిత్తం ఎస్సైకి సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు.

యువకుడి ఇంటి ఎదుట యువతి ధర్నా

- పరారైన నిందితుడు
- న్యాయం చేయాలంటున్న బాధితురాలు

ధర్మారం(ధర్మపురి): భర్తను కోల్పోయిన ఓ మహిళను ప్రేమ పేరిట లొంగదీసుకుని, ఆ తర్వాత మోసం చేసిన వ్యక్తి ఇంటి ఎదుట బాధితురాలు బైఠాయించింది. ఈ సంఘటన నర్సింగపూర్‌లో చోటుచేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం తిర్యాణికి చెందిన ఓ యువతికి వివాహం కాగా ఆ తర్వాత భర్త మరణించాడు. దీంతో ఆ యువతి ఉపాధి కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో అకౌంటెంట్‌గా పనికి కుదిరింది. అయితే, దూరపు బంధువైన శ్రీనివాస్‌రెడ్డితో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఇది ప్రేమగా మారింది. ఇద్దరూ కలిసి కొంతకాలం సహజీవనం చేశారు. ఈ క్రమంలో రెండుసార్లు ఆమెకు అబార్షన్ చేయించాడు. ఆ తర్వాత అయితే పెళ్లి చేసుకుంటానని నమ్మించిన శ్రీనివాస్‌రెడ్డి.. పెళ్లి విషయమై ఒత్తిడి చేయగా తాను పెళ్లి చేసుకోనని మోసం చేశాడు. తనకు అతడితో వివాహం జరిగేంత వరకూ ఆందోళనను కొనసాగిస్తానని సదరు యువతి సోమవారం నర్సింగపూర్ చేరుకుని శ్రీనివాస్‌రెడ్డి ఇంటి ఎదుట దీక్ష చేపట్టింది. స్పందించకుంటే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని పేర్కొంది. కాగా, శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లోంచి పరారైనట్లు తెలిసింది.



రామగుండంలో నోటికి శూలం గుచ్చుకుంటున్న భక్తురాలు



శూలాలు, ఘటాలు ధరించి, స్వాముల ఊరేగింపు

ఒంటినిండా శూలాలు.. గగుర్పొడిచే విన్యాసాలు



నూకాంబిక అమ్మవారి ఊరేగింపులో భక్తులు

బర్మా కాందీశీకుల ఆరాధ్య దైవం నూకాంబిక పోచమ్మ జాతర సోమవారం అగ్నిగుండ ప్రవేశంతో ముగిసింది. 15రోజులుగా నిత్యపూజలతో నూకాంబిక పోచమ్మతల్లికి విశేష పూజలు చేసిన భక్తులు.. చివరిరోజు నాలుక, శరీరానికి శూలాలు గుచ్చుకుని విన్యాసాలు ప్రదర్శించారు. విదేశాలతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి బర్మాకాందీశీకుల కుటుంబాలు హాజరై నూకాంబిక పోచమ్మతల్లి దీవెనలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్–మనాలిఠాకూర్ దంపతులకు ఉత్సవ కమిటీ చైర్మన్ జమ్ముల రామారావు నూకాంబిక చిత్రపటాన్ని అందజేశారు.

– రామగుండం/సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



అగ్నిగుండంలో నడుస్తున్న భక్తుడు



రామగుండం ఎమ్మెల్యే సతీమణికి నూకాంబిక చిత్రపటం బహూకరణ

తాగునీటి సమస్య పరిష్కరించండి

- ఇంకుడుగుంతల నిర్వహణను పర్యవేక్షించండి
- నగరంలో చలివేంద్రాలు ప్రారంభించండి
- పశువుల కోసం నీటితొట్లు ఏర్పాటు చేయండి
- రామగుండం నగరపాలక కమిషనర్ శ్రీకాంత్



మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ శ్రీకాంత్

కోల్‌సిటీ(రామగుండం): నగరంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీకాంత్ ఆదేశించారు. సోమవారం తన చాంబర్‌లో డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, ఎస్ఈ చిన్నారావుతో కలిసి ఇంజినీరింగ్ విభాగం అధికారులతో తాగునీటి సమస్యపై సమీక్షించారు. డివిజన్లలో తాగునీటి కోసం ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం వెంటనే కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని సూచించారు. పైపులైన్ల లీకేజీలను అరికట్టడానికి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని కోరారు. వేసవిలో ప్రజల దాహం తీర్చడానికి అవసరమైన ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. రంజాన్ సందర్భంగా ముస్లింలు ప్రార్థనలు చేసుకోవడానికి ఎంపిక చేసిన ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

ఇంకుడుగుంతల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి..

ఇంకుడుగుంతలపై పర్యవేక్షించడంతోపాటు గతంలో నిర్మించిన 100 ఇంకుడుగుంతలను శుభ్రం చేయించాలని శ్రీకాంత్ ఆదేశించారు. ఇకనుంచి వాటిని నిర్మించుకుంటేనే కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టిన యజమానులకు ఇంటి నంబర్ కేటాస్తామని స్పష్టం చేయాలని సూచించారు. 300 చదరపు మీటర్ల వైశాల్యం కలిగిన నివాసాలు నగరంలో 115 వరకు ఉన్నాయని, వీటి యజమానులు 15 రోజుల్లోగా ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని గడువు విధిస్తూ నోటీసులు జారీచేసినట్లు తెలిపారు. కొత్తగా ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టడానికి వార్డు ఆఫీసర్లతో సమాచారం సేకరించాలన్నారు. వాటిని నిర్మాణాన్ని ప్రోత్సహించేలా ఎన్టీపీసీ, సింగరేణి సంస్థలకు కూడా లేఖలు రాయాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ బోర్‌వెల్స్ వద్ద ఇంకుడుగుంతలు నిర్మించడానికి అంచనాలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్షలో ఈఈ సుచరణ్, డీఈ జమీల్ పాల్గొన్నారు.

జల్సాలకు అలవాటుపడి చోరీలు..

- దొంగ అరెస్టు
- 20 విద్యుత్ మోటార్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ కృష్ణ



పోలీసులకు రివార్డు ఇస్తున్న ఏసీపీ కృష్ణ

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): జల్సాలకు అలవాటు పడి చోరీలు చేస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఏసీపీ కృష్ణ తెలిపారు. సోమవారం సుల్తానాబాద్ సర్కిల్ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని మీర్జంపేట(కొత్తపల్లి)కు చెందిన గోపు సంపత్ తాపీ మేస్త్రీ, వ్యవసాయ పనులు చేసేవాడు. ఇలా వచ్చిన డబ్బులు తన జల్సాలకు సరిపోకపోవడంతో దొంగతనాలు చేయాలనుకున్నాడు. 2006 నుంచి గేదెలు, బంగారం ఇతర చోరీలకు పాల్పడగా పొత్కపల్లి, వీణవంక, కాల్వశ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం 2 నెలలుగా సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, పొత్కపల్లి మండలాల పరిధిలో రైతులు మానేరు వాగు, ఎస్సారెస్పీ కెనాల్లో ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లను ఎత్తుకెళ్తున్నాడు. వాటిని తన ఇంటి వద్ద దాచిపెట్టి, డబ్బు అవసరం ఉన్నప్పుడు విక్రయించేవాడు. ఈ క్రమంలో పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి గుంపుల బ్రిడ్జి సమీపంలో పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ద్విచక్రవాహనంపై వస్తున్న సంపత్ అనుమానాస్పదంగా కనిపించాడు. పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. విచారణలో తాను చోరీ చేసిన మోటార్‌ను హనుమకొండలో విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు, ఇదివరకు 20 మోటార్లను దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. పోలీసులు మోటార్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దొంగను పట్టుకున్న సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై అశోక్‌రెడ్డి, ఏఎస్సైలు తిరుపతి, రత్నాకర్, హెడ్‌కానిస్టేబుల్ రాజేందర్, కానిస్టేబుల్ తిరుపతినాయక్‌లను అభినందించి, రివార్డు అందించారు.

కూతురి ప్రేమ పెళ్లిపై కన్నీటి నిరసన

- ఆమె చనిపోయిందంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన తల్లిదండ్రులు
- సోషల్ మీడియాలో వైరల్



కూతురు ఫ్లెక్సీ వద్ద కన్నీరు పెడుతున్న నిర్మల-మురళీకృష్ణ



హరికుమార్ - అనూష

సిరిసిల్ల: అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు ఇంటి నుంచి వెళ్లిపోయి, ప్రేమ పెళ్లి చేసుకుందని ఓ తండ్రి కన్నీరు పెట్టుకున్నాడు. ఆమె చనిపోయిందంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేసి నిరసన తెలిపిన ఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సిరిసిల్ల పట్టణంలోని బీవై.నగర్‌కు చెందిన చిలువేరి మురళీకృష్ణ, నిర్మల దంపతులకు ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. కూతురు అనూష హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. వారం రోజుల కిందటే కాలేజీ నుంచి ఇంటికి వచ్చిన ఆమె స్థానికంగా ఉండే లింగం హరికుమార్‌ను ఆదివారం ప్రేమ వివాహం చేసుకుంది. అనూష తీసుకున్న ఈ నిర్ణయంతో తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. సోమవారం తమ ఇంటి ఎదుట అశ్రునివాళి అంటూ.. కూతురు ఫొటోతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. 'అమ్మలారా.. అయ్యలారా.. మాలాంటి కష్టం ఎవరికీ రావొద్దు.. కూతురును ఎంతో ప్రేమతో పెంచి, చదివిస్తే.. ఆమెను మోసం చేసి, ట్రాప్ చేసి ఇంటి నుంచి తీసుకెళ్లారంటూ..' విలపించారు. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

దోపిడీకి పాల్పడిన ఇద్దరి అరెస్టు

కరీంనగర్‌క్రైం: ఆటో ఎక్కిన వ్యక్తిని కొట్టి అతని వద్ద నుంచి సెల్‌ఫోన్, నగదు ఎత్తుకెళ్లిన ఇద్దరిని సోమవారం కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఏసీపీ నరేందర్ కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా మేడిపల్లి గ్రామానికి చెందిన శేక్ షబ్బీర్ గత నెల 30న పనినిమిత్తం కరీంనగర్‌కు వచ్చాడు. తిరిగి జగిత్యాలకు వెళ్లే క్రమంలో కోతిరాంపూర్‌లో నూనావత్ తిరుపతి ఆటో ఎక్కాడు. ఆ సమయంలో ఆటోలో మరొకకు బానోత్ రాజు కూడా ఉన్నాడు. అయితే ఆటో ఎక్కిన శేక్ షబ్బీర్‌ను డ్రైవర్ నూనావత్ తిరుపతి, ఆయన ఫ్రెండ్ బానోత్ రాజు ఆటోను నగరంలోని సిరిసిల్ల బైపాస్ రోడ్డువద్దకు తీసుకెళ్లి షబ్బీర్‌ను బెదిరించారు. దాడిచేసి సెల్‌ఫోన్ , బ్యాగు, బ్యాంక్ పాసుబుక్, ఏటీఎం కార్డు, ఇతర కార్డులు ఎత్తుకెళ్లారు. తర్వాత బాధితుడి మొబైల్ ఫోన్‌లోని సిమ్ కార్డును నిందితుల మొబైల్ ఫోన్‌లోకి మార్చి బ్యాంకు అకౌంట్ ద్వారా రూ.99 వేలను డ్రాచేశారు. ఈ విషయమై బాధితుడు షబ్బీర్ అదేరోజు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సోమవారం నిందితులు టవర్ సర్కిల్ ఏరియాలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకున్న సీఐ సరిలాల్, ఎస్సై స్వామి, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

'ఉపాధి' కూలీలకు సౌకర్యాలు కల్పించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డీఆర్‌డీవో శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని, పని ప్రదేశాల్లో మంచినీరు, నీడ సౌకర్యం కల్పించడంతోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. పని సమయాన్ని ఉదయం 7 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు కొనసాగించాలని కోరారు. ఎక్కువ సమయం ఉంటే వడదెబ్బ తగిలే అవకాశం ఉందన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే కూలీలకు రవాణా సౌకర్యం కల్పించాలని, విధులు సక్రమంగా నిర్వహించని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కొన్ని గ్రామాల్లో మధ్యాహ్నం 12 గంటల వరకు పనులు చేయిస్తున్నారని, ఫొటో అప్‌లోడ్ చేసిన తర్వాతే కూలీలు ఇంటికి వెళ్లే పరిస్థితి నెలకొందన్నారు. భూ కొలతలు లేకుండా పనులు కల్పించి, కూలీలను ఆర్థికంగా ఆదుకోవా లని, కిలోమీటర్ పైగా దూరం ఉన్న పని ప్రదేశాల కు వెళ్లేందుకు రవాణా సౌకర్యం కల్పించాలని కోరా రు. సంఘం జిల్లా అధ్యక్షుడు బోయిని అశోక్, జిల్లా నాయకుడు ఎగుర్ల మల్లేశం తదితరులున్నారు.

29 ఏళ్లకు పోలీసులకు చిక్కాడు

జగిత్యాల క్రైం: చోరీ కేసులో నిందితుడు కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరిగాడు. 29 ఏళ్లకు పోలీసులకు చిక్కాడు. సీఐడీ అడిషనల్ డీజీపీ షిఖా గోయల్ సోమవారం సంబంధిత వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. జగిత్యాల రూరల్ మండలం పెర్కపల్లి శివారులోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన ముఠాపై 06.01.1995న జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కరీంనగర్ సీఐడీకి బదిలీ చేశారు. ఈ కేసులో ఏ–27 నిందితుడిగా ఉన్న నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన నక్ర చందు అలియాస్ చంద్రయ్య కోర్టుకు హాజరు కాకపోవడంతో నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది. అప్పటినుంచి సీఐడీ పోలీసులు అతని కోసం వెతుకుతున్నా జాడ తెలియలేదు. ఎట్టకేలకు సీఐడీ అడిషనల్ డీజీపీ షిఖా గోయల్ ఆధ్వర్యంలో ఎస్పీ రాంరెడ్డి, ఎస్పీడబ్ల్యూఎస్ టీం సభ్యులు నరేశ్, యూనస్‌ఖాన్, రతన్‌జీ రావ్, హన్మంతరావు ఆదివారం ఖానాపూర్‌లో చంద్రయ్యను అరెస్టు చేశారు. కరీంనగర్ ఫస్ట్ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చినట్లు పోలీసులు పేర్కొన్నారు.

వివాహిత హత్య కేసులో భర్త, అత్తకు జీవిత ఖైదు

గోదావరిఖని టౌన్(రామగుండం): అదనపు వరకట్నం కోసం వేధించి, వివాహితను హత్య చేసిన ఆమె భర్త, అత్తకు జీవిత ఖైదు విధిస్తూ గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి టి.శ్రీనివాసరావు సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. గోదావరిఖని ఎల్‌బీ నగర్‌కు చెందిన బీనవేని గౌతమి, హనుమాన్‌నగర్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి బిస్సా రాజు మార్చి 14, 2009లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరి కాపురం కొన్నేళ్లు సజావుగానే సాగింది. రాజు తల్లి దుర్గమ్మ సింగరేణి వైద్యశాలలో ఉద్యోగిని. అయితే, గౌతమి తండ్రి ఐలయ్య సింగరేణి ఉద్యోగిగా రిటైర్డ్ కావడంతో వచ్చే డబ్బుల్లో నుంచి రూ.10 లక్షలు అదనపు కట్నంగా తీసుకురావాలని ఆమె భర్త, అత్త వేధించడం మొదలుపెట్టారు. ఆగస్టు 9, 2014న గౌతమిని గొంతు నులిమి హత్య చేశారు. ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు మృతదేహంపై కిరోసిన్ పోసి, నిప్పంటించారు. ఈ ఘటనపై మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అప్పటి వన్‌టౌన్ సీఐ సీహెచ్.శ్రీధర్ 498ఎ, 302, 304బి, 201రీడ్ విత్ 34ఐపీసీ సెక్షన్ 4ఆఫ్ డీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి గోదావరిఖని ఏసీపీ ఫకీరప్ప కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రస్తుత వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ ఆఫీసర్, సీఎంఎస్ ఇన్‌చార్జి శంకర్ కోర్టులో 28 మంది సాక్షులను ప్రవేశపెట్టారు. అదనపు జిల్లా న్యాయస్థానం అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ టి.జ్యోతిరెడ్డి వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో రాజు, దుర్గమ్మకు జీవిత ఖైదు విధించారు.

బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించాలి

- ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర



మాట్లాడుతున్న నాయకుడు ధర్మేంద్ర

గోదావరిఖని: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీని ఓడించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర కోరారు. సోమవారం స్థానిక భాస్కర్‌రావుభవన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టి మూడోసారి అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ పావులు కదుపుతోందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లిస్తే రాజ్యాంగాన్ని హిందువులకు అనుకూలంగా మార్చేస్తాం అంటూ మతాల మధ్య చిచ్చురేపే ప్రకటనలను బీజేపీ నాయకులు చేస్తున్నారని ఆరోపించారు. యువత, విద్యార్థులను మోసం చేయడంలో బీజేపీ, బీఆర్ఎస్‌లు సిద్ధహస్తులయ్యాయని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు లింగం రవి, మానస్‌కుమార్, మార్కపురి సూర్య, తాళ్ల సురేందర్, ఆసాల నవీన్, సాదుల శివ, దుర్గం విజయ్‌కుమార్, గోషిక పవన్, ప్రీతమ్, రానవేణి సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

రామగిరి(మంథని): నాగెపల్లి బస్టాండ్ సమీపంలో ఎస్సై కె.సందీప్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఈసందర్భంగా అటుగా వస్తున్న లారీని ఆపి తనిఖీ చేశారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు తేలడంతో లారీని పట్టుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనుమతి పత్రాలు చూపించాలని డ్రైవర్‌ను ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పలేదని, దీంతో లారీని పోలీసుస్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టామని ఎస్సై వివరించారు.

వందరోజులు గడిచినా గుర్తింపు ఏది?

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

గోదావరిఖని: సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరిగి వందరోజులు గడిచినా గెలిచిన సంఘాలకు గుర్తింపు, ప్రాతినిధ్య పత్రాలు ఇవ్వలేదని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. సోమవారం జీడీకే–11గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్‌తో సంబంధం లేకుండా కేంద్ర కార్మిక శాఖ, సింగరేణి యాజమాన్యం గుర్తింపు పత్రాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘంగా ఏఐటీయూసీ గెలిచిన తర్వాత ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయించామన్నారు. కార్మికుల పిల్లలకు సెంట్రల్ సిలబస్ బోధించేలా సంస్థ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇంకా అనేక పెండింగ్ సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామని అన్నారు. ముఖ్యంగా కొత్త గనులు రావాలని, కార్మికుల సొంత ఇంటి పథకం అమలు చేయాలని, పదోన్నతులు కల్పించాలని కోరారు. గనుల్లో పాత యంత్రాలను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేయాలన్నారు. గోదావరిఖనిలో రోడ్ల విస్తరణ పేరుతో కార్మికుల క్వార్టర్లను తొలగించకూడదని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం చేసిన చట్టంతోనే సింగరేణిలో కొత్త గనులు రావడం లేదన్నారు. పాత గనులను మూసివేసి ఓపెన్‌కాస్టులుగా మారుస్తున్నారని ఆరోపించారు. నాయకులు ఎల్.ప్రకాశ్, మడ్డి ఎల్లాగౌడ్, ఆరెల్లి పోశం, మోదుగుల సంపత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.